# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 17-04-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **తిరుపతిలో 16వ ఆర్థిక సంఘం సభ్యులు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, పారిశ్రామిక ప్రతినిధులతో ఈ మధ్యాహ్నం సమావేశమవుతారు.**
2. **వెలిగొండ ప్రాజెక్టు పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అధికారులను ఆదేశించారు.**
3. **యువతకు ఉపాధి, రాష్ట్రాభివృద్ధి తోడ్పాటు అందించేలా మైనింగ్ రంగాన్ని తీర్చిదిద్దుతామని గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.**
4. **రాష్ట్రం నుండి హజ్ యాత్ర-2025 ప్రయాణాలు ఈనెల 29వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు.**
5. **ప్రపంచ హీమోఫీలియా అవగాహనా దినం ఈ రోజు నిర్వహిస్తున్నారు.**

==========================

రాష్ట్ర పర్యటనలో భాగంగా 16వ ఆర్థిక సంఘం సభ్యులు ఈ రోజు తిరుపతికి చేరుకున్నారు. ఈ మధ్యాహ్నం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, పారిశ్రామిక ప్రతినిధులతో సమావేశం కానున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అభివృద్ధి అంశాలతో పాటు పలు అంశాలపై చర్చించనున్నారు. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవులు ఈ సమావేశంలో పాల్గొంటారు.

-------------------------

వెలిగొండ ప్రాజెక్టు పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అధికారులను ఆదేశించారు. విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో వెలిగొండ ప్రాజెక్ట్ పై జలవనరుల శాఖ అధికారులతో ఆయన నిన్న సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2026 జూన్ నాటికి టన్నెల్-2 బెంచింగ్, లైనింగ్ పనులు మరింత వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టులో కీలక పనుల కోసం 106.39 కోట్ల రూపాయలకు మంత్రి వర్గం ఆమోదం తెలిపిందని చెప్పారు. టన్నెల్ బోరింగ్ మెషిన్ తొలగించడానికి కమిటీని నియమిస్తున్నట్లు తెలిపారు.

-------------------------

యువతకు ఉపాధి, రాష్ట్రాభివృద్ధికి తోడ్పాటు అందించేలా మైనింగ్ రంగాన్ని తీర్చిదిద్దుతామని గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో గనుల శాఖ అధికారులతో

మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,రాష్ట్రంలో గనుల రంగం అభివృద్ధికి మెరుగైన మైనింగ్ విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. రాష్ట్రంలోని క్లిష్టమైన ఖనిజాలకోసం ప్రత్యేక విధానాన్ని తీసుకువచ్చామని చెప్పారు. భూగర్భ వనరుల్ని భవిష్యత్ ఉపాధి కల్పనకు వినియోగించుకునేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని మంత్రి వివరించారు.

---------------------------

సైబర్ నేరాలపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నేర పరిశోధన విభాగం –సిఐడి ఐజి ఆకే రవికృష్ణ కోరారు. గుంటూరులోని సిఐడి ప్రాంతీయ కార్యాలయంలో ఆయన నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ, అశ్లీల వీడియోల ద్వారా డబ్బు సంపాదించే బృందాన్ని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. ఇటువంటి చర్యలకు పాల్పడే వారి గురించి జాతీయ స్థాయి సైబర్ క్రైమ్ కాల్ సెంటర్ నంబరు 1930కి ఫోన్ చేసి తెలియచేయాలని ఆయన కోరుతూ,

వాయిస్.. 32 సెకన్లు

---------------------------

హజ్ –2025 యాత్ర కు రాష్ట్రం నుండి యాత్రికుల ప్రయాణాలు ఈనెల 29వ తేదీ నుంచి ప్రారంభం అవుతాయని రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. ఈ మేరకు ఆయన విడుదల చేసిన ఒక ప్రకటనలో హజ్ యాత్ర ప్రయాణాలకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. రాష్ట్రం నుండి మొత్తం 1630 మంది ఈ ఏడాది హజ్ యాత్రకు వెళ్తున్నట్లు తెలిపారు. ఇందులో 1170 మంది యాత్రికులు హైదరాబాద్ నుండి బయలుదేరుతున్నారని తెలిపారు. హజ్ యాత్ర ప్రయాణ ప్రణాళికలో భాగంగా మొదటి విడతలోమొత్తం 236 మంది ఈనెల 29వ తేదీ నుండి మే 11 తేదీ వరకు హైదరాబాద్ నుండి మదీనా బయలుదేరుతారని పేర్కొన్నారు. హజ్ నిబంధనల మేరకు ప్రభుత్వం తరపున యాత్రికులు తప్పనిసరిగా టీకాలు వేయించుకోవాలని మంత్రి సూచించారు.

---------------------------

రాజధాని అమరావతి పునర్ నిర్మాణ పనుల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హాజరు కానున్న నేపథ్యంలో ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు సకాలంలో పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అధికారులను ఆదేశించారు.అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ప్రధానమంత్రి పర్యటన ఏర్పాట్లపై నిన్న ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 5 లక్షల మంది ప్రజలు హాజరవుతారనే అంచనాలతో వాహనాల పార్కింగ్, ఇతర మౌలిక సదుపాయలకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రజలు, ప్రముఖులు సభా ప్రాంగణానికి చేరుకునేలా ఆయా రహదారులపై వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులు ఆదేశించారు.

---------------------------

ప్రపంచ హీమోఫీలియా అవగాహనా దినం ఈ రోజు నిర్వహిస్తున్నారు. అరుదైన వ్యాధిగా వైద్య నిపుణులు పేర్కొనే ఈ వ్యాధితో బాధపడుతున్న వారికి చిన్న గాయం తగిలినా రక్త స్రావం జరుగుతుంది. జన్యు లోపం కారణంగా వారసత్వంగా ఈ వ్యాధి సంక్రమించే అవకాశం ఉందని వైద్య నిపుణులు తెలియజేస్తున్నారు. ఇటువంటి లోపం వున్న వారు స్క్రీనింగ్ పరీక్ష ద్వారా దీనిని గుర్తించి హిమోఫీలియా వ్యాధిని నియంత్రించ వచ్చునని కూడా

వారు సూచిస్తున్నారు. వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ హిమోఫీలియా వ్యవస్థాపకులు ఫ్రాంక్ బల్ జయంతి సందర్భంగా ప్రతి ఏటా ఏప్రిల్ 17వ తేదీన ఈ కార్యక్రమం జరుగుతోంది.

---------------------------

పౌష్టికాహార ప్రాధాన్యతను తెలిపేలా పోషణ పక్షోత్సవాలను నిర్వహిస్తున్నామని విజయనగరం జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పోషణ్ పక్వాడా కార్యక్రమ అమలుపై వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గర్భస్త దశ నుంచి బిడ్డకు 2 సంవత్సరాల వయసు వచ్చే వరకు 1000 రోజుల సంరక్షణ అత్యంత కీలకమని చెప్పారు. అలాగే లబ్దిదారులు తమంతట తామే పోషణ్ ట్రాకర్‌లో తమ పేర్లను నమోదు చేసుకునే విధంగా వారికి అవగాహన కల్పిస్తున్నామని ఆయన తెలియజేస్తూ,

వాయిస్ ..29 సెకన్లు

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎల్. నారాయణ కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

.....వాయిస్.... 21 సెకన్లు....

---------------------------

రైతులకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన వ్యవసాయం చేయడంతో పాటు, అంతర్జాతీయ స్థాయిలో మార్కెటింగ్ సదుపాయాలు కల్పిస్తామని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో డిజిటల్ గ్రీన్ సంస్థ ప్రతినిధులతో ఆయన నిన్న సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, సన్న, చిన్నకారు రైతులకు డిజిటల్ గ్రీన్ ఒక గ్లోబల్ అభివృద్ధి సంస్థగా నిలుస్తోందన్నారు. సాంకేతిక, డేటా ద్వారా వ్యవసాయదారులు సాధికారత సాధించేలా కృషి చేస్తోందని తెలిపారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 121వ సంచిక ఈనెల 27వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది."మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 25వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

======================